
నమస్తే తెలంగాణ

నిజామాబాద్

5 | నిజామాబాద్, గురువారం 26 డిసెంబర్ 2024 | NIZAMABAD


# షాడో ఎమ్మెల్యేలు!

**జనం ఛీత్కరించినా మారని నేతలు**

నిజామాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో వింత ధోరణి కొనసాగుతున్నది. జనం ఛీత్కరించిన వారిదే హవా నడుస్తున్నది. ఎన్నికల్లో ప్రజలు ఓడించిన వారికే యంత్రాంగం వత్తాసు పలుకుతున్నది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన కొందరు నేతలు షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్నారు. శాసనసభ్యుడి వలే అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ, ప్రజా తీర్పును అపహాస్యం చేస్తూ కొందరు నేతలు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఘనంగా చెప్పుకుంటున్న ప్రజా పాలనలో కనిపిస్తున్న విచిత్రమిది. సాక్షాత్తు కలెక్టర్ల ఎదుటే ప్రొటోకాల్ నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నది. ఓడిపోయిన నేతలనే యంత్రాంగం అందలం ఎక్కిస్తున్న వైనం ఉమ్మడి జిల్లాలో మాత్రమే కనిపిస్తున్నది. ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఎంత మొత్తుకుంటున్నా అటు ప్రభుత్వం, ఇటు యంత్రాంగం కిమ్మనడం లేదు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేసినా, బీజేపీ ఎమ్మెల్యేలు శాసనసభలో లేవనెత్తినా సర్కారు నుంచి కనీస స్పందన కరువైంది. శాసనసభ్యులకు కనీస గౌరవం దక్కని దుస్థితిని రూపుమాపాల్సిన ఉన్నతాధికారులే మిన్నకుండి పోతుండడంతో రోజురోజుకూ ఈ పెడ ధోరణి విస్తృతమవుతున్నది. అడిగే వారు, అడ్డు చెప్పే వారు లేకపోవడంతో కాంగ్రెస్ నాయకుల ఆగడాలకు అడ్డే లేకుండా పోతున్నది.

## మితిమీరిన జోక్యం..

రాష్ట్ర స్థాయి పదవిని అనుభవిస్తున్న వ్యక్తి కామారెడ్డి షాడో ఎమ్మెల్యేగా అధిరాక దర్పం ప్రదర్శిస్తున్నాడు. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఆయనను కాదని అన్నింట్లోనూ వేలు పెడుతున్నాడు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక కాంగ్రెస్ కీలక నేత యంత్రాంగాన్ని పావుగా వాడుకుంటున్నాడు. భిక్కనూర్ మండలంలోని బస్వాపూర్, కాచాపూర్ సొసైటీ విభజన విషయంలో కాంగ్రెస్ వృద్ధ నేత జోక్యం చేసుకుని అభాసుపాలయ్యాడు. బీఆర్ఎస్ నేతల ఆధిక్యం ఉండటంతో సొసైటీని అల్లకల్లోలం చేసి రైతులను ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నానికి ఒడిగట్టాడు. కానీ బీఆర్ఎస్ నాయకులు న్యాయస్థానాలను ఆశ్రయించి ధైర్యంగా కుట్రలను ఎదుర్కొన్నారు. ఈ విషయంలో కామారెడ్డి జిల్లా సహకార శాఖ అధికారి నేరుగా కాంగ్రెస్ నేతల చెప్పుచేతల్లోకి వెళ్లి, వారు చెప్పినట్లు పని చేసి పెట్టాడు. కానీ, కోర్టు ఆదేశాలతో తిరిగి నిబంధనలను అమలు చేయాల్సిన దుస్థితిని తెచ్చుకున్నాడు. ఇలా అనేక విషయాల్లోనూ కామారెడ్డి కాంగ్రెస్ నేత తీరు వివాదాస్పదంగా మారింది.

నిజామాబాద్ అర్బన్‌లో బీజేపీ ఎమ్మెల్యే ప్రభావం కనిపించకుండా కాంగ్రెస్ నేతలే నిత్యం హల్‌చల్ చేస్తున్నారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ మేయర్‌గా బీఆర్ఎస్ నేత ఉన్నప్పటికీ, మున్సిపల్ వ్యవహారాల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ఉన్న చోట నిబంధనల మేరకు ప్రొటోకాల్ అమలవుతుండగా, అదే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న చోట మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో కొత్తగా గెలిచిన ఓ ఎమ్మెల్యేకు పాత సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ ఊహించని రీతిలో ఝలక్ ఇచ్చారు. దీంతో అతడ్ని బదిలీ చేసే దాకా సదరు ఎమ్మెల్యే విడిచిపెట్టలేదు. ప్రజలు తిరస్కరించిన కాంగ్రెస్ నేతలు తమ తప్పులు గ్రహించి, మంచి పనులు చేస్తూ జనం మనసుల్ని గెలుచుకోవాలి. కానీ ప్రజా తీర్పును అపహాస్యం చేస్తూ తామే ఎమ్మెల్యేలమని అధికార దర్పం ప్రదర్శిస్తున్న తీరు అంతటా చర్చనీయాంశమైంది.

## ఓడిన వారికే అందలం..

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బాల్కొండ, ఆర్మూర్, కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. అయితే, ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికైన ఎమ్మెల్యేలను కాదని, ఓడిన వారికే యంత్రాంగం వత్తాసు పలుకుతున్నది. ప్రజా తీర్పును అపహాస్యం చేస్తూ అధికారాలను చలాయిస్తున్న కాంగ్రెస్ నేతలు చెప్పినట్లే నడవుచుకుంటున్నది. కార్యనిర్వాహక వ్యవస్థకే సిగ్గుచేటుగా కొంత మంది ఉన్నతాధికారుల తీరు ప్రజల్లోనూ ఈసడింపునకు గురి చేస్తున్నది. ఆదిలోనే అనధికార వ్యక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోగా, వారిని ప్రోత్సహిస్తుండడంపై బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తులకే నియోజకవర్గంలో ప్రభుత్వంతో సంబంధాలుండాలి. ప్రజలకు, ప్రభుత్వానికి ఎమ్మెల్యేనే వారధిగా ఉండాలి. ఆర్మూర్ నియోజకవర్గంలో ఓడిపోయిన కాంగ్రెస్ నేత బహిరంగంగానే ప్రభుత్వ ప్రతినిధిగా తానే ఉంటానంటూ చెప్పుకోవడం విడ్డూరంగా మారింది. బాల్కొండలోనూ ఓడిపోయిన కాంగ్రెస్ నాయకుడే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, సహజ వనరులను కొల్లగొడుతుండడం విమర్శలకు తావిస్తున్నది. ఇసుక, మొరం, కంకర వంటి దందాల్లో రూ.లక్షల్లో దండుకుంటున్నా అధికారులు కిమ్మనడం లేదు. ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీ నాయకులపై అధికార పార్టీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. భీమ్‌గల్‌లో అయితే ఇసుక వ్యాపారులు ఏకంగా దాడులకు తెగబడి బీఆర్ఎస్ నేతలను రక్తమొచ్చేలా కొట్టారు.

ఆర్మూర్, బాల్కొండలో నిబంధనల ఉల్లంఘనల పర్వం తారాస్థాయికి చేరింది. జీపీ సెక్రటరీ నుంచి ఆర్డీవో దాకా అందరూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీలకే సలాం కొడుతున్నారు. వికారాబాద్ కలెక్టర్‌పై గిరిజన రైతుల దాడి సమయంలో ఉద్యోగ సంఘాల నేతలంతా ఊకదంపుడు ఉపన్యాసాలు, నీతి వ్యాఖ్యలు ప్రబోధించారు. అవే సంఘాలు ఇప్పుడు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో జరుగుతున్న ఉల్లంఘనలపై మాత్రం నోరు మెదపడం లేదు. ఇదేం నీతి, ఇదేం పద్ధతి అంటూ ప్రజలు ఉద్యోగ సంఘాల నేతలను ప్రశ్నిస్తున్నారు.

# పోలీసుశాఖలో కలకలం

**ఎస్సై, మహిళా కానిస్టేబుల్ అదృశ్యం**

- అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు కట్టపై కారు, ఫోన్లు లభ్యం
- చెరువులో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు
- భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట కానిస్టేబుల్ శ్రుతితోపాటు మరో వ్యక్తి మిస్సింగ్
- శ్రుతి, నిఖిల్ మృతదేహాలు లభ్యం..
- ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్పీ సింధూశర్మ



ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి

రామారెడ్డి, డిసెంబర్ 25 : కామారెడ్డి జిల్లా పోలీసుశాఖలో బుధవారం రాత్రి కలకలం రేగింది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట మహిళా కానిస్టేబుల్ శ్రుతి అదృశ్యం కావడం, వారి సెల్‌ఫోన్లు అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు కట్టపై లభ్యం కావడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానించారు. ఈ మేరకు చెరువులో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శ్రుతి, నిఖిల్ మృతదేహాలు లభ్యమయ్యాయి. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ కోసం గాలిస్తున్నారు. వారి ఫోన్లు స్విచాఫ్ రావడంతో రంగంలోకి దిగిన పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులో ఉన్నట్లు గుర్తించి అక్కడకు వెళ్లారు. చెరువు కట్టపై ఎస్సై సొంత కారుతో పాటు మూడు ఫోన్లు, మూడు జతల చెప్పులు లభ్యమయ్యాయి. వాటి ఆధారంగా ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతితో పాటు బీబీపేట పీఏసీఎస్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నిఖిల్‌గా గుర్తించారు. ముగ్గురు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానించారు.

సమాచారమందుకున్న ఎస్పీ సింధూశర్మ హుటాహుటిన అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. గాంధారి మండల కేంద్రానికి చెందిన శ్రుతి బీబీపేటలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నది. మెదక్ జిల్లాకు చెందిన సాయికుమార్ గతంలో బీబీపేట ఎస్సైగా పని చేసి, బదిలీపై భిక్కనూరుకు వచ్చారు. బీబీపేటలో పని చేసిన సమయంలోనే వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడిందని పోలీసులు చెబుతున్నారు. అయితే, ఇద్దరూ కలిసి ఒకేసారి అదృశ్యం కావడం, ఫోన్లు, చెప్పులు ఒకేచోట లభ్యం కావడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు భావించారు. వీరితో పాటు మరో వ్యక్తి కూడా ఉండడం కూడా అనేక అనుమానాలకు తావిస్తున్నది.

# మచ్చర్ల లిఫ్ట్.. కేసీఆర్ గిఫ్ట్

- బీఆర్ఎస్ హయాంలోనే ఎత్తిపోతల పథకాలు మంజూరు
- ఏడాది కాలంగా ముందుకు సాగని పనులు
- కాంగ్రెస్, బీజేపీలు ఆర్మూర్ పాలిట అష్ట దరిద్రాలు
- పనులు వేగవంతం చేయకపోతే వెంటాడుతాం
- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



మచ్చర్ల లిఫ్ట్ ఎత్తిపోతల పథకం పనుల కోసం తెచ్చిన పైపులను చూపిస్తున్న జీవన్‌రెడ్డి

నందిపేట్, డిసెంబర్ 25: రైతుల చిరకాల వాంఛ అయిన మచ్చర్ల లిఫ్ట్ కేసీఆర్ గిఫ్ట్ అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ పాలన స్వర్ణయుగమని, కాంగ్రెస్, బీజేపీ కలిసి ఇప్పుడు రాతియుగం తెచ్చాయని మండిపడ్డారు. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, కాంగ్రెస్, బీజేపీలను వెంటాడి తీరుతామని హెచ్చరించారు. మచ్చర్ల లిఫ్ట్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గానికి మంజూరైన మూడు కొత్త లిఫ్ట్‌లు బీఆర్ఎస్ ఇచ్చినవేనని స్పష్టంచేశారు. మచ్చర్ల, జోద్‌పూర్, ఖుద్వాన్‌పూర్ గ్రామాల రైతులకు చెందిన 2,860 ఎకరాల భూమిని సాగులోకి తెచ్చేందుకు మచ్చర్ల ఎత్తిపోతల పథకానికి రూ.40 కోట్లు, ఫత్తేపూర్, చేపూర్, సుర్భిర్యాల్ ఎత్తిపోతల పథకానికి రూ.110 కోట్లు, చిక్లీ-గుంజిలి లిఫ్ట్‌కు రూ.89 కోట్లను తానే మంజూరు చేయించానని జీవన్‌రెడ్డి తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో మంజూరైందనే అక్కసుతో మచ్చర్ల లిఫ్ట్ పనులను ఏడాదిగా చేపట్టడం లేదని మండిపడ్డారు. పైగా కాంగ్రెస్ నాయకులు మందికి పుట్టినోళ్లు మావాళ్లే అన్న చందంగా బీఆర్ఎస్ హయాంలో మంజూరైన ఎత్తిపోతల పథకాలను కూడా తామే మంజూరు చేయించామని చెప్పుకుంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. తాను రెండోసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే మచ్చర్ల లిఫ్ట్‌కు రూ.40 కోట్లు మంజూరయ్యాయని, నిధులకు సంబంధించిన జీవో కూడా వచ్చి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయి కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కూడా జరిగిందని జీవన్‌రెడ్డి వివరించారు. బీఆర్ఎస్ హయాంలో వచ్చిందనే అక్కసుతో ఏడాది కాలంగా పనులు చేపట్టకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్, బీజేపీ ఆర్మూర్ పాలిట అష్టదరిద్రాలుగా మారాయని మండిపడ్డారు. గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే తెచ్చిన నిధులు నిల్, ఓడిన కాంగ్రెస్ నేత అవినీతి ఫుల్.. ఈ రెండు పార్టీల పుణ్యమా అని ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి కిల్ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ చేసింది శూన్యమన్నారు. ఇప్పటికైనా ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలని, ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తామే వెంటాడి చేయిస్తామని హెచ్చరించారు.



నిజామాబాద్ సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**ఉమ్మడి జిల్లాలో** బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డిలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ సందర్భంగా చేసిన ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి. చిన్నారులు వివిధ వేషధారణల్లో మురిపించారు. ఏసు బోధనలు అనుసరణీయమని, ప్రేమ, క్షమగుణాలను అలవరచుకోవాలని, ఏసు చూపిన మార్గంలో నడవాలని పాస్టర్లు, ఫాదర్లు సూచించారు.





కామారెడ్డిలో..

# అమిత్ షా దిష్టిబొమ్మల దహనం

రెంజల్, డిసెంబర్ 25: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాలు బుధవారం పలుచోట్ల ఆందోళనలు చేపట్టాయి. రెంజల్ మండలం దూపల్లిలో మాల మహానాడు ఆధ్వర్యంలో, ఆర్మూర్‌లో దళిత బహుజన అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. అమిత్ షా తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని లేకపోతే ఆయనను ప్రధాని మోదీ బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.



దూపల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల ప్రతినిధులు



కామారెడ్డిలో సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన

# బజారుకెక్కిన విద్యాబోధన

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినూత్న నిరసన
- రోడ్డుపైనే పాఠాలు చెప్పిన సిబ్బంది

కామారెడ్డి, డిసెంబర్ 25: డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగిన సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు బుధవారం కామారెడ్డిలో వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రోడ్డుపైనే పాఠాలు చెబుతూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలిపారు. 16 రోజులుగా సమ్మె చేస్తుండడంతో విద్యా వ్యవస్థలో అన్ని పనులు నిలిచిపోయాయని, బోధన ఆగిపోయిందని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛాయ్ తాగినంత సమయంలో సమస్యలు పరిష్కరిస్తామన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తమను రెగ్యులరైజ్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని, అప్పటివరకూ పే స్కేల్ అమలు చేయాలని కోరారు. ఈ నెల 30న నిర్వహించనున్న మంత్రిమండలి సమావేశంలో తమ సమస్యలపై చర్చించి పరిష్కరించాలన్నారు. సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వాసంతి, సంఘం ప్రతినిధులు సంపత్, రాములు, సంతోష్‌రెడ్డి, శైలజ, కాళిదాసు, వీణ, సాయిలు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి పంటలకు ఎస్సారెస్పీ నీరు

**కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువకు నీటి విడుదల**

మోర్తాడ్, డిసెంబర్ 25: శ్రీరాంసాగర్ ఆయకట్టు కింద యాసంగి పంటల సాగు కోసం బుధవారం నుంచి నీటి విడుదలను ప్రారంభించారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్తా, ఈఈ చక్రపాణి తదితరులు కాలువలకు నీటిని విడుదల చేశారు. కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 300, లక్ష్మి కాలువకు 150 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల కొనసాగుతున్నది. యాసంగి పంటల సాగుకు వదిలిన నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. డీఈఈలు రఘుపతి, గణేశ్, గంగాభూషణ్, అధికారులు పాల్గొన్నారు.



నీటి విడుదల చేసిన సందర్భంగా పుష్పాలు చల్లుతున్న ఎస్సారెస్పీ అధికారులు